JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | ఆదివారం 19-04-2026
Medchal - Malkajgiri | Sunday 19-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 322
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 322 | Pages : 8 | ₹: 5


6 లో



## ప్రతి తల్లికి, చెల్లికి క్షమాపణలు చెబుతున్నాను

- బిల్లు వీగిపోయినప్పుడు కొన్ని వంశపారంపర్య పార్టీలు చప్పట్లు కొట్టడం సిగ్గుచేటని మోదీ మండిపడ్డారు
- 'నారీ శక్తి' కార్యక్రమాన్ని 21వ శతాబ్దపు అతిపెద్ద మహా యజ్ఞం
- రాజకీయ లబ్ధి కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించడం కాంగ్రెస్ నైజం

**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 :**

మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ వంటి కీలక అంశాలపై తప్పుడు ప్రచారాలు చేయడం ద్వారా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం రాత్రి 8:30 గంటలకు జాతిని ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. నారీ శక్తి బిల్లు వీగిపోయిన నేపథ్యంలో ఆయన కీలక ప్రకటన చేశారు. 'భారత నారీశక్తితో మాట్లాడాలని అనుకుంటున్నారు. ముందుగా ప్రతి తల్లికి, చెల్లికి క్షమాపణలు చెబుతున్నాను. మహిళా శక్తిని ఎలా అడ్డుకున్నారో ప్రతి ఒక్క పౌరుడు చూశారు. డీఎంకే, కాంగ్రెస్, ఎస్పీ, టీఎంసీ స్వార్థపూరిత రాజకీయాలు చూశాం.' అని మోదీ అన్నారు. ప్రతిపక్ష పార్టీలు తమ స్వార్థ రాజకీయాల కోసం మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్నాయని మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ...మిగతాది 2 లో

> తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను అవమానించేలా తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆవు చేనులో మేస్తే.. దూడ గట్టు మీద మేస్తుందా అని ప్రశ్నించారు.

## మహిళా బిల్లు ఒక్కటే తెస్తే మద్దతిస్తాం



- బీజేపీకి రేవంత్ రెడ్డి పిలుపు

**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 18 :**

మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కాంగ్రెస్, ఇండియా కూటమి కారణమని చేస్తున్న ప్రచారాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజన తో ముడిపెట్టడం వల్లనే తాము అడ్డుకున్నామని స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఆ బిల్లును సవరించండి. కేవలం 33% మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ప్రత్యేక బిల్లును సోమవారం నాటికి తీసుకురండి, మేము వెంటనే మద్దతు ఇచ్చి పాస్ చేస్తాం అని కేంద్రానికి సవాల్ విసిరారు. మహిళా బిల్లు పేరుతో దక్షిణాది రాష్ట్రాల సీట్లను తగ్గించాలనే కుట్రను సహించబోమని తేల్చిచెప్పారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో తమ ప్రాధాన్యతను కోల్పోతాయని రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. గత 30, 50 ఏళ్లుగా జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసినందుకు మాకు శిక్ష వేస్తారా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు, ఇతర దక్షిణాది నేతల ఆలోచనలు కూడా ఇదే దిశలో ఉన్నాయని, ప్రాంతీయ హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ, దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను రేవంత్ రెడ్డి సమర్థించారు. చంద్రబాబు నాయుడు చాలా తెలివైన వారు, అపార అనుభవం గల నేత. ఆయన ఏదీ తప్పుగా చెప్పరు అని రేవంత్ ప్రశంసించారు. జనాభాను పెంచుకోవాలంటూ చంద్రబాబు ఇచ్చిన పిలుపు వెనుక పెద్ద వ్యూహం ఉందని, మోదీ ప్రభుత్వం తెచ్చిన చట్టాలపై ఆయన నేరుగా కాకపోయినా సంకేతాల ద్వారా తన నిరసనను తెలిపారని రేవంత్ విశ్లేషించారు సమఝ్దార్ కో ఇషారా కాఫీ హై తెలివైన వారికి చిన్న సంకేతం చాలు అంటూ ఎన్డీయే మిత్రపక్షాల్లోనే అసంతృప్తి మొదలైందని రేవంత్ చెప్పుకొచ్చారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను అవమానించేలా తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆవు చేనులో మేస్తే.. దూడ గట్టు మీద మేస్తుందా అని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ పార్లమెంటులో తెలంగాణ ఏర్పాటును తల్లిని చంపి బిడ్డను వేరు చేయడం తో పోల్చిన విషయాన్ని గుర్తు చేశారు. పెద్దలే అలా మాట్లాడినప్పుడు, కింద ఉన్న నేతలు అలాగే మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ఏ బిల్లు ప్రవేశపెట్టినా, ...మిగతాది 2 లో

## తమిళనాడులో తిరిగి డిఎంకె కూటమిదే అధికారం



- లౌకికవాదం కోసం తమిళ ప్రజలు ముందుంటారు
- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**జయభేరి, తమిళనాడు :**

ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ నాయకత్వంలోని కూటమి తమిళనాడులో తిరిగి మంచి మెజారిటీతో అధికారంలోకి రాబోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట జిల్లా షోలింగేర్ సర్కిల్ సమీపంలోని పండియానల్లూర్ లో ఏర్పాటుచేసిన రాహుల్ గాంధీ సభలో పాల్గొన్నారు. సభ ఏర్పాట్ల ముందు శనివారం ఉదయం రాణి పేట జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ప్రసంగించారు. లౌకిక వాదాన్ని బలోపేతం చేయడంలో సంరక్షించడంలో తమిళనాడు ప్రజలు ముందుంటారని తెలిపారు. వీరగడ్డకు, ఆత్మగౌరవానికి తమిళనాడు మారుపేరు అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని తపించే ఒక సామాన్య కార్యకర్తగా మీ అందరి ముందుకు వచ్చానని డిప్యూటీ సీఎం తెలిపారు. తమిళనాడు అంటే కేవలం ఒక రాష్ట్రం కాదు అదొక సిద్ధాంతం. పెరియార్, అన్నాదురై, కలైంజర్ కరుణానిధి వంటి గొప్ప నేతలు ఇక్కడ సామాజిక న్యాయానికి పునాది వేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఢిల్లీ పీఠంపై కూర్చున్న పెద్దలు తమిళనాడు సంస్కృతిని, భాషను, హక్కులను కాల రాయాలని చూస్తున్నారని వారిని ఎదుర్కోవాలి అంటే సెక్యులర్ శక్తుల ఐక్యత అవసరం అన్నారు. సీఎం. ఏంకే స్టాలిన్ నాయకత్వంలో తమిళనాడు అభివృద్ధి పథంలోకి దూసుకుపోతుంది, రాహుల్ గాంధీ ప్రేమ సందేశం స్టాలిన్ అభివృద్ధి నినాదం ఒకటి అయ్యాయి, డీఎంకే కూటమి గెలుపు కేవలం తమిళనాడుకే కాదు దేశానికి దిక్సూచిగా మారబోతుంది అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్ సిలిండర్, రెండు లక్షల వరకు ఒకేసారి రైతులకు రుణమాఫీ, ...మిగతాది 2 లో



## జైల్లో పెట్టటం దురదృష్టకరం

- తెలంగాణ ఉద్యమకారులను మెహదీపట్నం పోలీస్ స్టేషన్ నుంచి విడిపించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**జయభేరి, హైదరాబాద్ :**

కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ శనివారం చలో సెక్రటేరియట్ కు ఉద్యమకారులు బయలు దేరారు. పోలీసులు ...మిగతాది 2 లో

## కేసీఆర్ వస్తున్నారు



- రాష్టంలో ఒక రాజకీయ పునరేకీకరణ జరుగుతోంది
- రేవంత్ కు హైట్ తక్కువ అనుకున్నాం.. బుర్ర కూడా తక్కువనే.. కేటీఆర్

**జయభేరి, జగిత్యాల :**

ఏప్రిల్ 20వ తేదీన జగిత్యాలలో నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణాన్ని సందర్శించిన తరువాత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ.. జగిత్యాలలో కోలాహలం, ఒక పండుగ వాతావరణం ఇవ్వాళ అందరికీ కనబడుతోంది. జగిత్యాల నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ...మిగతాది 2 లో

## కాంగ్రెస్ పార్టీ మహిళలకు ద్రోహం చేసింది

- మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు
- ప్రతిపక్షాల అసలు రంగు దేశవ్యాప్తంగా తేటతెల్లమైంది
- రాబోయే ఎన్నికల్లో మహిళలు తమ ఓటు ఆయుధంతో ప్రతిపక్షాలకు గట్టి బుద్ధి చెప్పాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు


2 లో

# యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 18:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్య నారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ





సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి శనివారం నిత్య రాబడిలో భాగంగా రూ.19,85,980 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,66,800, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,76,400, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.1,29,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.1,58,100, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,30,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.50,832, ప్రసాద విక్రయం ద్వారా రూ.6,50,500, కల్యాణ కట్ట ద్వారా రూ.43,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



## స్వామి వారి సేవలో మంత్రి నారా లోకేష్ ఓఎస్డీ చైతన్య దంపతులు

జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 18 :

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఓఎస్డీ చైతన్య కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. శనివారం యాదగిరిగుట్టకు వచ్చిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా,ఆలయ అధికారులు స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట టిడిపి పట్టణ, మండల అధ్యక్షుడు చిత్తార్ల శ్రీనివాస్,మచ్చ నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య భవనం లీజు రద్దు చేయాలి



జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 18 :

కురుమల ఆత్మ గౌరవం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోకాపేటలో నిర్మించిన దొడ్డి కొమురయ్య భవనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెందిన నారాయణ విద్యా సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలంగాణ కురుమ సంఘం ప్యానెల్ 2 అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ కురుమ,వర్కింగ్ ప్రెసిడెంట్ మాదారం కృష్ణ,తెలంగాణ రాష్ట్ర నాయకులు కర్రె వెంకటయ్య ఆరోపించారు. శనివారం యాదగిరిగుట్టలో నిర్వహించిన కురుమ సంఘం ముఖ్య నాయకులు సమావేశంలో వారు మాట్లాడారు. దొడ్డి కొమురయ్య కురుమ భవనాన్ని నారాయణకు లీజుకు ఇస్తే కురుమల ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టినట్లేనన్నారు. దోడ్డి కోమురయ్య భవనం లీజును వెంటనే రద్దు చేయాలని తెలిపారు. జూన్ నెలలో దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనం వద్ద ఆమరణ దీక్షలు,ఆందోళన కార్యక్రమాలు చేసేందుకు సిద్ధమవుతున్నామన్నారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీ కర్రె సత్యనారాయణ, యూత్ ప్రెసిడెంట్ అడికె సంతోష్,స్థానిక కురుమ సంఘం నాయకులు మంగ నర్సింహులు,కర్రె చంద్రశేఖర్, ఒగ్గు బిక్షపతి,మోటే శేఖర్, గౌడ శ్రీశైలం, ఎడవెల్లి కరుణాకర్, ఆత్కూరి అయిలయ్య, కాధూరి కరుణాకర్, కర్రె సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరులో మంత్రులకు జిఎంఆర్ ఘనస్వాగతం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి వచ్చిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మరియు యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి శనివారం పాలమూరు జిల్లా మాజీ డిసిసి అధ్యక్షుడు, దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఘనంగా స్వాగతం పలికారు. వివిధ కార్యక్రమాలలో పాల్గొనడానికి వచ్చిన మంత్రులకు ఎమ్మెల్యే పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అలాగే వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.పూల బొకేలను అందజేశారు.

## దేహ ధారుఢ్యానికి క్రీడలు దోహదం

- బిజెపి జిల్లా మాజీ కార్యదర్శి కొత్త కాపు నారాయణరెడ్డి



జయభేరి, దేవరకద్ర :

దేహ ధారుఢ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని బిజెపి జిల్లా మాజీ కార్యదర్శి కొత్త కాపు నారాయణరెడ్డి అన్నారు. ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం దేవరకద్ర నియోజకవర్గం స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ,ఖోఖో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతి ఒక్కరు క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు, సిసి కుంట మండల పార్టీ అధ్యక్షుడు దశరథ్ లతో పాటు స్థానిక 4వ వార్డు కౌన్సిలర్ ఉమా రాజు అనిల్, అప్పీ వెంకటేశ్వర రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## మన్యంకొండ వెంకటేశ్వర స్వామి తిరుచ్చి సేవ

- అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన స్వామివారు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవా పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి నుండి శోభాయమానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామివారిని దేవస్థానం ముందున్న రథమండపం వరకు ఊరేగింపుగా తీసుకోవచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురుల మధ్య స్వామి వారి ఊరేగింపు ముందుకు కదిలింది. ఈ సందర్భంగా మండపంలో స్వామివారికి దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. అనంతరం స్వామివారిని మళ్లీ పల్లకిలో గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, ఈఓ శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారిలతోపాటు దేవస్థానం సిబ్బంది, పురోహితులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆహ్వానం



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల ప్రవేశాలకు ఆహ్వానం విశాలమైన భవనం, క్రీడా మైదానం, క్రీడా పరికరాలు, జిమ్ రూమ్, సెమినార్ హాల్,గ్రంథాలయం ,అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, కంప్యూటర్ ల్యాబ్స్ వైఫై సదుపాయం, NSS I&II units, NCC, PG కోచింగ్ క్లాసెస్ ,ప్రతి సంవత్సరం దాదాపు 100 మంది విద్యార్థినులు డిగ్రీ పట్టతో బయటకు వెళ్తున్నారు ప్రస్తుతం NAAC(B++) గ్రేడ్ తో కళాశాల నడుస్తున్నది. ఎప్పటి లాగే ఈ కళాశాల 20262027 విద్యా సంవత్సరానికి ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆహ్వానం పలుకుతోంది. BA, BCOM (computer applications& G), BSC (Life science & Physical science) అని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. హరిప్రియ అధ్యాపక బృందం తెలియజేశారు.

# కమలం గూటికి మల్లారెడ్డి

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 18:





తెలంగాణ రాజకీయాల్లో ఆయన ఒక సంచలనం. టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కానీ రేవంత్‌రెడ్డితో ఉన్న విభేదాల కారణంగా చేరిక జరగలేదు. ఇప్పటికే ఆయన ఎవరో అర్థమై ఉంటుంది కదూ.. హా ఆయనే.. పూలమ్మిన.. పాలమ్మిన.. స్కూల్ పెట్టిన.. కాలేజీలు పెట్టిన.. ఎంపీగ గెలిచిన.. ఎమ్మెల్యేగ గెలిచిన.. మంత్రి అయినా అంటూ తన వాక్‌చాతుర్యం, బాడీ లాంగ్వేజ్‌తో ఆకట్టుకునే మల్లారెడ్డి. ప్రస్తుతం అధికారంలో లేరు. దీంతో సైలెంట్ అయ్యారు. అయితే ఇటీవల ఆయన కోడలు, మల్లారెడ్డి విద్యాసంస్థల కో చైర్‌పర్సన్ ప్రీతి రెడ్డి యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇటు సోషల్ మీడియాలో, అటు రాజకీయాల్లో ఆమె ప్రముఖంగా వినిపిస్తున్నారు. ఈ క్రమంలో మల్లారెడ్డి ప్రధాని మోదీతో భేటీకావడం ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశమైంది. ప్రీతిరెడ్డి గతంలోనే ఎంపీ పదవి కోసం ఆసక్తి చూపారు. బండి సంజయ్‌ను ఆమె కలవడం, స్వయంగా పార్లమెంటరీ స్థానం కోరుకుంటున్నట్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ గుర్తులోకి వచ్చాయి. మల్లారెడ్డి ఈ సమావేశంలో ప్రధానిని ఆమె పక్షాన కోరుతూ మధ్యవర్తిగా వ్యవహరించారా? ఇది ఒక వైపు లాభదాయకమైన రాజకీయ కుట్రగా కనిపిస్తోంది.ఈ భేటీ ఫలితంగా ప్రీతికి టికెట్ దక్కితే, మల్లారెడ్డి కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందా? బీఆర్ఎస్‌లో ఇప్పటికే భిన్నాభిప్రాయాలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఇది పార్టీ మార్పు సూచనగా కనిపిస్తుంది. బీజేపీ తెలంగాణలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలనుకుంటే, స్థానిక నాయకులను ఆకర్షించడం సహజం. అయితే, ఇది బీఆర్ఎస్‌కు మరో షాక్‌గా మారవచ్చు.ఈ సంఘటన తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. కుటుంబ ఆధారిత రాజకీయాలు ఎప్పుడూ వివాదాస్పదం. బీజేపీ ఎమ్మెల్యేలను, ఎంపీలను పెంచుకోవడం ద్వారా తన పట్టుకు బలం చేకూర్చుకుంటుందా? రానున్న రోజుల్లో ఈ చర్చలు మరింత ఉద్ధృతమవుతాయి.

# నేడే సుదర్శన యాగం

- శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

జయభేరి, యాదగిరిగుట్ట :



ప్రపంచ శాంతి కోరుతూ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నేడు సుదర్శన యాగం, శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణమహోత్సవాన్ని యాదగిరిగుట్టలోని మున్నూరు కాపు సంఘం భవనం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు మాజీ శాసనమండలి చైర్మన్ నేతి విద్యాసాగర్ రావు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ తెలిపారు. శనివారం యాదగిరి గుట్ట పట్టణంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో విలేఖరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 7 గంటలకు సుదర్శన యాగం, ఉదయం 10 గంటలకు కల్యాణమహోత్సవం జరుగుతుందని తెలిపారు. సుదర్శన యాగం, శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరవుతున్నట్లు, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కులమతాలు, రాజకీయాలకతీతంగా భక్తులు, స్థానికులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం యాదగిరి గుట్ట ఆలయ మాజీ ప్రధానార్చకుడు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు మాట్లాడుతూ సుదర్శన యాగం,శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణం నిర్వహించడం హర్షనీయమన్నారు. ఈ సమావేశంలో టీఎంకేజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు రజినీకాంత్, ట్రస్టు నిర్వాహకులు పలుగుల శ్రీనివాస్, పుప్పాల నరసింహులు, టీఎంకేజెఎఫ్, రాష్ట్ర కోఆర్డినేటర్ తుడి జనార్ధన్, జిల్లా అధ్యక్షుడు యేలుగల కుమారస్వామి, ఆవుల సురేందర్, పోతంశెట్టి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## దేవుడిచ్చిన మానవ జన్మను ప్రతి ఒక్కరు సార్ధకత చేసుకోవాలి

- విశ్రాంత డిఐఓ సత్యనారాయణమూర్తి

జయభేరి, దేవరకద్ర :




మానవసేవనే మాధవసేవగా భావించాలని విశ్రాంత డిఐఓ సత్యనారాయణమూర్తి అన్నారు.మానవసేవే మాధవసేవగా భావించి ప్రతి ఒక్కరు మానవత్వం దైవత్వం సేవలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. మహబూబ్ నగర్ కు చెందిన శ్రీ సాయి లలిత సేవా మండలి ఆధ్వర్యంలో శనివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం మన్యంకొండ హాజీలాపురం గ్రామంలో దేవాలయానికి, అలాగే అంగన్వాడిలకు వాటర్ ట్యాంకులను ఆయన ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని దేవాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సత్యనారాయణమూర్తి, సాయి లలిత సేవా మండలి సభ్యురాలు శాంతకుమారి మాట్లాడారు. 2009 లో కేవలం 5గురితో ప్రారంభించిన తమ సంస్థ ప్రస్తుతం 60 మంది సభ్యులతో కలిసి పేదలకు, దేవాలయాలకు, వృద్ధాశ్రమాలకు, అనాధాశ్రమాలకు, అందుల పాఠశాలల్లో సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.మనిషికి సంపద ముఖ్యం కాదని, ఎంతో కొంత ఇతరులకు దానం చేసి దేవుడిచ్చిన మానవ జన్మను సార్థకత చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో హాజిలాపురం గ్రామానికి మరిన్ని సేవలు అందిస్తామని వారు హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ జ్యోతి ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ దేవాలయానికి ,అంగన్వాడికి నీటి ట్యాంకులను అందించటం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పలువురు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ కు కట్టుబడి ఉంది

- మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి
- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ తో కలిసి విలేకరుల సమావేశంలో మంత్రులు



**జయభేరి, దేవరకద్ర :**

కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ కు కట్టుబడి ఉందని రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మరియు యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాకు శనివారం ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పంచవటి విద్యాలయం వద్ద నిర్వహించిన ఆరైవ్ఆలైవ్ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన మంత్రులు దేవరకద్ర ఎమ్మెల్యే, పాలమూరు జిల్లా మాజీ డిసిసి అధ్యక్షుడు జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. దాని ఫలితమే పార్లమెంట్ లో ఆ బిల్లు వీగిపోయిందన్నారు. మహిళా బిల్లుకు అన్ని రకాల సహకారాన్ని కాంగ్రెస్ పార్టీ అందించిందన్నారు. కానీ భాజపా డీలిమిటేషన్ కు,మహిళా బిల్లుకు లింకు పెట్టిందని వారు ఆరోపించారు. కుట్రపూరితంగా బిజెపి మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిందని వారు విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బిజెపి పార్టీ ఖూనీ చేసే ప్రయత్నం చేసిందని వారు ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును బిజెపి ఎంపీలు పాకిస్తాన్ విభజనతో పోల్చడం దుర్మార్గమైన చర్య అని వారన్నారు. భాజపా నాయకులు తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలిగా మహిళను నియమించింది అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఎందుకని బిజెపి జాతీయ అధ్యక్షురాలుగా ఒక మహిళకు ఈరోజు వరకు అవకాశం ఇవ్వలేక పోయిందని వారు ప్రశ్నించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలను పార్లమెంటు రికార్డుల నుంచి వెంటనే తొలగించాలన్నారు. ప్రస్తుతం డిలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. మహిళా బిల్లును ఇండివిజువల్ గా ప్రవేశపెడితే కాంగ్రెస్ ముందుండి ఆ బిల్లును పాస్ అయ్యేలా బాధ్యత తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు ఎప్పుడు కూడా కట్టుబడి ఉంటుందని మంత్రులు అన్నారు. మహిళలకు ప్రాతినిధ్యం వహించేది కాంగ్రెస్ పార్టీనే అని వారన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఎన్నికల రాజకీయ లబ్ధి కోసమే బిజెపి ఈ బిల్లును తెరమీదకు తీసుకువచ్చింది తప్ప వారికి మహిళా రిజర్వేషన్లపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మంత్రులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఒబేదుల్లా కొత్వాల్, మహబూబ్ నగర్ మేయర్ శ్రీమతి మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, మూడ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, భూత్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ బాలకోటి లతోపాటు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉపాధి హామీ జాబ్ కార్డుల నవీకరణ

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 18 :**

తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామంలో శనివారం ఉపాధి హామీ కూలీల జాబ్ కార్డుల అప్డేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దిరావత్ రమేష్‌నాయక్ మాట్లాడుతూ కూలీల వివరాలను నమోదు చేసి కార్డులను అప్డేట్ చేసినట్లు తెలిపారు. ఎండల తీవ్రత దృశ్య కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ స్వాతి ,ఫీల్డ్ అసిస్టెంట్ పాముగల కరుణాకర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## జనన గణనను పారదర్శకంగా నిర్వహించాలి



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 18 :**

జనన గణన ను పారదర్శకంగా నిర్వహించాలని తహసిల్దార్ రవికుమార్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జననగణన కు సంబంధించి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మంజూష రాణి, ట్రైనర్స్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగనవాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు




**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 18 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని ఒకటి రెండు అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం గర్భిణీలకు సామూహిక శ్రీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ స్వరాజ్యం, సూపర్వైజర్ నాజీ మునిఫా, అంగన్వాడీ టీచర్లు పుట్ట సునీత, తోట భాగ్య లక్ష్మి, గర్భిణీ స్త్రీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు త్వరగా పని చేసుకోవాలి



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 18 :**

ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు త్వరగా పనికి వచ్చేలా చూసుకోవాలని డి ఆర్ డి ఓ నాగిరెడ్డి అన్నారు. శనివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారా అని లేదా కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకే పనులను పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లాలని అన్నారు. కూలీలు ప్రతిరోజు తమ వెంట రెండు లీటర్ల త్రాగునీరును తెచ్చుకోవాలని అన్నారు. ఎండల దృశ్య ప్రాణాలను కాపాడుకొని పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్ చాంద్ పాషా, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## చలివేంద్రానికి మజ్జిగ అందించడం అభినందనీయం

- సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి దాతలు మజ్జిగ పంపిణీ చేసి సహకరించడం అభినందనీయమని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కే ఎంపీ హెల్పింగ్ హాండ్స్ వెల్ఫేర్ సొసైటీ కి పరమేశ్వర మొబైల్స్ కొండమల్లేపల్లి వారు శనివారం మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా పరమేశ్వర మొబైల్స్ నిర్వాహకులు శుక్ రాజ్ ను కే యం పి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు, సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, కూన భానుచందర్, శ్రీను నాయక్, హరీష్, గోపిక తదితరులు పాల్గొన్నారు.

# సీఎం నివాసం ముట్టడించిన బీజేపీ నాయకులు

- మహిళల హక్కులను అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా సీఎం నివాసం ముట్టడించిన బీజేపీ నాయకులు
- బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి





**జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 18 :**

హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించే కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి బీజేఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ మహిళా నాయకులు పాల్గొన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఓటు వేయడాన్ని నిరసిస్తూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా పోలీసులు జోక్యం చేసుకుని, ముఖ్యమంత్రి నివాసం సమీపంలో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డిని బలవంతంగా అదుపులోకి తీసుకుని జియాగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా వ్యవహరించడం దేశ మహిళలకు అన్యాయం అని అన్నారు. మహిళలకు 33 శాతం రాజకీయ అవకాశాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును వ్యతిరేకించడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుంచి మహిళా రిజర్వేషన్ బిల్లు మరియు నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. దక్షిణ భారతంపై ప్రాంతీయ భావజాలాన్ని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన పార్టీలకు మహిళలు రాజకీయంగా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళలకు విస్తృత అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ముందుకు తెచ్చిన బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా నియోజకవర్గాల పునర్విభజన అంశాన్ని కారణంగా చూపుతూ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, యువతకు రాజకీయ అవకాశాలు రాకుండా అడ్డుకోవడం కాంగ్రెస్ అసలు స్వభావాన్ని బయటపెడుతుందని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో ఏ.గీత,బి.జ్యోతి, దినేష్ కుమార్, కె. నీరజ, కె. సారల, కవిత రెడ్డి, కుమారి, మంజుల రాణి, మోహన్, నాని ముత్త, పద్మ మహేశ్వరి రెడ్డి, పాల్ ప్రవీణ్, ప్రేమ్ కుమార్, ఎస్. కవిత, శారద, శ్యామ్ కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 18 :**

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన, ఇంప్రూవ్మెంట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించిన రాజస్వ మండలాధికారి



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలములోని ముదిగొండ గ్రామములో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించిన రాజస్వ మండలాధికారి దేవరకొండ, తహశీల్దార్ దేవరకొండ, ఎ.వో దేవరకొండ గ్రామ సర్పంచ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మిక సంఘం జేఏసీ నాయకులకు ఘనంగా సన్మానం

**జయభేరి, దేవరకొండ :**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైనటువంటి దేవరకొండ డిపో ఆర్టీసీ కార్మిక సంఘం జేఏసీ నాయకులు నాయకులకు ఘనంగా సన్మానం చైర్మన్ శ్రీనివాస్ వైస్ చైర్మన్ ఓరుగంటి రమేష్‌గౌడ్, కోశాధికారి ఆర్ నందు లను మేమంటో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మీ కార్మిక సంఘం సమస్యలపై నిరంతరం జాతీయ బీసీ సంక్షేమ సంఘం మద్దతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు మీకు రావాల్సినటువంటి ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందించడంలో మా వంతు కృషి చేస్తామని తెలిపారు మీరు భవిష్యత్తులో అత్యున్నత పదవులు అధిరోహిస్తూ కార్మిక లోకానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు పున్న వెంకటేశ్వర్లు భీమగోని శివ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ బాషా చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.


# భూ రీ-సర్వేతో దశాబ్దాల భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలం నాయుడుపాలెం గ్రామ పంచాయతీలో భూ రీసర్వేపై శనివారం ప్రజలకు అవగాహన సదస్సు మరియు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ యజమానులకు పలు కీలక సూచనలు చేశారు. భూ రీసర్వే ద్వారా దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సర్వే సమయంలో భూ యజమానులు స్వయంగా తప్పకుండా హాజరై తమ భూముల హద్దులను చూపెట్టాలని, అవసరమైన పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతులు, పక్క వాటాదారులందరూ సహకరించుకొని, ఐక్యమత్యంగా ఒక తాటిపైకొచ్చి లోటుపాటులను సరిదిద్దుకొని భూ రీసర్వే సంపూర్ణంగా పూర్తి చేసుకోవాల్సిందిగా కోరారు. గ్రామ పెద్దలు మాట్లాడుకొని కమిటీలగా ఏర్పడి భూ రీసర్వే కార్యక్రమానికి సహకరించాలన్నారు. ఈ భూ రీసర్వే పూర్తి అయినతో ఇకపై భూ విస్తీర్ణంలో ఎటువంటి తప్పులకు తావుండదని స్పష్టం చేశారు. ఈ సర్వే ఎప్పటి నుంచి మొదలవుతుందన్న విషయం ఈ నెల 24 తరువాత తెలియపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు అడిగిన ప్రశ్నలకు, అధికారులు చాలా క్షుణ్ణంగా సమాధానం చెప్పారు. సదస్సు అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల్లో అధికారుల ఆధ్వర్యంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. భూ రీసర్వేతో భూమికి రక్షణ యజమానికి భరోసా అంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రతి భూ యజమాని ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భూములకు శాశ్వత హక్కు పత్రాలను పొందాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూండ్రపు శ్రీరామమూర్తి, కూండ్రపు మధు, కూండ్రపు సీతారామయ్య, కూండ్రపు రాజీవ్, కూండ్రపు నానాజీ, రాజాన సత్యారావు, రాజా ముత్యాలు, బండారు శ్రావణ్, హరి, బాబు, కండక్టర్ అప్పలనాయుడు, కన్నూరు నేస్తాలు, గెడ్డం నర్సింగరావు, రాజాన సత్యనారాయణ, గెడ్డం రామారావు, గంగునాయుడు, సారిపల్లి నేస్తాలు, సారిపల్లి సోమునాయుడు, అయ్యబాబు, కనక అప్పారావు, శంకరరావు, అప్పలనాయుడు, గ్రామ సచివాలయ సర్వేయర్లు అజేయ్, హరీష్, వీఆర్ఏ రాజు, రైతులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మండల పరిధిలో రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం ఏపీ ఈపీడీసీఎల్ ఈపి బోనంగి సెక్షన్ పరిధిలో సోమవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీడీసీఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆర్డిఎస్ఎస్ విద్యుత్ పనుల నిర్వహణలో భాగంగా ఈపి బోనంగి, బొద్ధపువానిపాలెం,గొర్లివాని పాలెం,పిఎస్ బోనంగి,పిఆర్ బోనంగి,కలపాక, మరిసవానిపాలెం,కలపాక గొల్లలపాలెం,స్వయంభు వరం,సోమునాయుడుపాలెం తదితర గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని తెలిపారు.పైన తెలిపిన ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఈఈ మురళీకృష్ణ కోరారు.

# ధర్నా చౌక్ లో పాల్గొన్న యూత్ కాంగ్రెస్ నాయకులు

- **ఇండో-యూఎస్ డీల్ ను రద్దు చేయాలని నిరసన**

**జయభేరి, దేవరకద్ర :**

హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నా చౌక్ లో దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివాంత్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్ అహ్మద్ దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూదిరెడ్డి లక్ష్మీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో దేవరకద్ర నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ నాయకులు ఈ ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ లో పాల్గొన్నారు. దేశ ప్రయోజనాలను అమెరికా చేతిలో తాకట్టు పెట్టి, భారత ప్రజలకు ప్రత్యేకించి రైతులకు అన్యాయం చేస్తూ,అదానికి మేలు చేసే ఇండోయూఎస్ ట్రేడ్ డీల్‌ను రద్దు చేయాలని పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సూదిరెడ్డి లక్ష్మీకాంత్ రెడ్డి, మహబూబ్ నగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయి, భూత్పూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్.భూపతి రెడ్డి, మూసాపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయిని రవికుమార్, చిన్న చింతకుంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుట్టపల్లి రంజిత్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు వగ్గుల విన్సెంట్, దేవరకద్ర నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ అజ్జు, రమేష్, ఆంజనేయులు సోషల్ మీడియా కోర్డినేటర్లు కార్తీక్ గౌడ్, బ్రహ్మయ్య, శివప్రసాద్ గౌడ్,శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# నేడు పేరూర్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలు

- **హాజరుకానున్న దాదాపు 250 ఉపాధ్యాయులు, 1500 విద్యార్థులు**
- **పాఠశాల పూర్వ విద్యార్థుల అధ్వర్యంలో కార్యక్రమం**
- **హాజరు కానున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జిఎంఆర్**

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కౌకుంట్ల మండలం పేరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామంలో పాఠశాల ప్రారంభించి గత ఏడాదితో 75 వసంతాలు నిండాయి. దీంతో ఆదివారం పాఠశాల వజ్రోత్సవ వేడుకలను పాఠశాల పూర్వ విద్యార్థులు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు 1950 నుండి 2025 వరకు పాఠశాలలో చదివిన విద్యార్థులు, విద్యను బోధించిన ఉపాధ్యాయులు హాజరవుతున్నారు.

ఈ వేడుకలకు దాదాపు 250 ఉపాధ్యాయులతో పాటు 1500 విద్యార్థులు హాజరవుతున్నట్లు అంచనా వేశారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి వచ్చిన వారికి భోజన వసతి కూడా కల్పిస్తున్నారు.

ఆరోజు ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. అలాగే రాత్రి 7 గంటల నుండి 11 గంటల వరకు వివిధ సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. దాదాపు రెండు నెలల నుండి పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడానికి కసరత్తు చేస్తున్నారు.


ఉమ్మడి దేవరకద్ర మండలంలో ఒక ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవ వేడుకలను ఇంత పెద్ద ఎత్తున నిర్వహించాలని అనుకోవడం ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమానికి పాఠశాలలో చదివిన విద్యార్థులతో పాటు విద్యను బోధించిన ఉపాధ్యాయులు, ఆహుతులు అందరు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని పేరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కోరారు.



# నేడు పేరూర్ కు మంత్రి, ఎమ్మెల్యే రాక

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కౌకుంట్ల మండలం పేరూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరుగు పాఠశాల వజ్రోత్సవ మహోత్సవానికి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్)లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. పేరూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా గ్రామంలో పాఠశాల వద్ద ఈ వజ్రోత్సవ లను పాఠశాల పూర్వ విద్యార్థులు నిర్వహిస్తున్నారు. ఈ వజ్రోత్సవాలకు పాఠశాలలో ఇంతవరకు విద్యను బోధించిన దాదాపు 250 మంది ఉపాధ్యాయులు, 1500 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. దీనికి గాను పాఠశాల వద్ద కార్యక్రమం విజయవంతం చేయడానికి పూర్వ విద్యార్థులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- **రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరమేశ్వర్‌రెడ్డి**

**జయభేరి, ఉప్పల్ :**



ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయనున్నట్టుగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పరమేశ్వర్‌రెడ్డి శనివారం రామంతాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలోని సమస్యలను తెచ్చారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపోవడంలేదని పరమేశ్వర్‌రెడ్డికి వివరించారు. ఇదే కాకుండా మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేవన్నారు. వీటితో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. రామంతాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోనూ అదనపు గదుల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలను సైతం ఏర్పాటు చేయనున్నట్టుగా చెప్పారు. ఇదే కాకుండా అన్ని రకాల సదుపాయాలను కూడా కల్పించనున్నట్టుగా తెలిపారు. కార్యక్రమంలో రామంతాపూర్ ZPHS హైస్కూల్ ప్రిన్సిపాల్ లత గారు,మండల్ ప్రైమరీ స్కూల్ HM రేణుక గారు,డాన్ బిక్షపతి గారు,ఎర్రం శ్రీనివాస్ గారు,విజయ్ కుమార్ గారు,సిద్దగోని రాజు గారు రవీందర్ రావు ,కిరణ్ రమేష్, రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామంతాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండ్ రఫీక్, ఎండ్ తాఫీక్, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్,లూకాస్, శామ్యూల్, జంగయ్య, సందీప్, కండి శ్రవణ్, ఉపేందర్ రెడ్డి, పూస సతీన్న, బాబురావు, శ్రీధర్, బుల్లెట్ అశోక్, భాస్కర్, సచిన్, జిల్లు,నాగ మల్లయ్య, కే శంకర్, శ్రీనివాస్ గౌడ్, లింగం, నయీమ్, రాజు, సతీష్ గౌడ్, నర్సిమ, మహేష్, రవి, అంబికా, శోభతదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కుట్రలను తిప్పికొట్టాలి

- **జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో కో ఆర్డినేటర్ గోవర్ధన్ నాయి**



**జయభేరి, దేవరకద్ర :**

డిలిమిటేషన్ విషయంలో బిజెపి కుట్రలను తిప్పి కొట్టాలని జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కో కో ఆర్డినేటర్ గోవర్ధన్ నాయి అన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ పేరుతో దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యాలను తగ్గించే మోడీ ప్రభుత్వం ప్రయత్నాలను రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి తిప్పికొట్టడం ప్రజాస్వామ్య విజయమని ఆయన అన్నారు. ఈ రెండు బిల్లులతో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టాలను వివరిస్తూ ,దక్షిణాది రాష్ట్రాలను ఏకం చేసినా ఘనత మన ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. భారత దేశ ఐక్యతే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని గోవర్ధన్ నాయి అన్నారు.

# పీర్జాదిగూడ చెరువులలో దోమల మందు పిచికారీ

- **మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసిన తుంగతుర్తి రవి**

**జయభేరి, మేడిపల్లి :**



మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్ చెరువులలో ఈరోజు మున్సిపల్ అధికారులు డ్రోన్ సహాయంతో దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల దోమలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో దోమల మందు పిచికారీ చర్య కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా, చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, అతి త్వరగా పూర్తి స్థాయిలో శుభ్రపరిచే చర్య తీసుకుంటామని MMC అధికారులు వెల్లడించారు. దోమల నివారణ కోసం చేపట్టిన ఈ చర్యలను అభినందిస్తూ,MMC బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ A.శైలజ గారికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతపూర్ ఏరియాలో దోమల నివారణకు శాశ్వత పరిష్కారం చూపించాలని మున్సిపల్ అధికారులకు మనవి చేశారు. ఈ కార్యక్రమంలో DE జాహ్నవి, AEE మహేష్, ఎంటమాలజిస్ట్ రాంబాబు, SFA నరేష్ తదితర MMC సిబ్బంది పాల్గొన్నారు.



# ఈ భోనంగి అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

8వ పోషణ పక్వాడ ఏప్రిల్ 9 నుంచి 23లో భాగంగా ఈ భోనంగి, ఎదురువానిపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏ శ్యామల కుమారి ఆధ్వర్యంలో శనివారం పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భవతులు, బాలింతలకు, 0 నుండి 6 సంవత్సరాలు పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా పిల్లల్లో 80 శాతం మెదడు అభివృద్ధి రెండు సంవత్సరాలు లోపు జరుగుతుందని పిల్లల్ని మొబైల్స్ కి టీవీలకి దూరంగా ఉంచాలని పిల్లలకి కథల పుస్తకాలు చూపిస్తూ కథలు చెప్పాలని తెలియజేశారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలలో జరిగే అభివృద్ధిలు గురించి వివరిస్తూ ఈ వయసు పిల్లలుకు ఆటల ద్వారా పాటల ద్వారా విద్య నేర్పించడం వల్ల పిల్లలలో మానసిక,శారీరిక, సామాజిక, భాషభివృద్ధి జరుగుతాయని మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల్ని అంగన్వాడి కేంద్రాల్లో జాయిన్ చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు కాంత రమణమ్మ, ఆశ కార్యకర్తలు, పిల్లల తల్లులు,గర్భవతులు,బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ ప్రాంతీయ స్థాయి పోటీలలో గవర్నమెంట్ కాలేజీ విద్యార్థులు విజయం



**జయభేరి, పరవాడ:**

పరవాడ గవర్నమెంట్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎఐ పోస్టురే కరెక్షన్ సిస్టం అనే వినూత్న ప్రాజెక్ట్ తో బెంగళూరులో నిర్వహించిన కోడవర్ 7.0 ప్రాంతీయ స్థాయి పోటీలలో విశిష్ట విజయాన్ని సాధించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్ బాబు మాట్లాడుతూ ఈ విషయం ఎంతో గర్వకారణం అని పోటీలో విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిభతో ప్రజెంట్ చేసి, తమ సృజనాత్మకత, కృషి, మరియు నైపుణ్యాన్ని ప్రతిభావంతంగా ప్రదర్శించారని ఈ విజయంతో కళాశాల ప్రతిష్ఠ మరింతగా పెరిగిందని అన్నారు.ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది అందరూ ఆనందం వ్యక్తం చేస్తూ, విద్యార్థుల పట్టుదల, కృషి, సృజనాత్మకతకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటివి మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిచారు.ఈ సందర్భంగా ఎన్టిపిసి వారి సౌజన్యంతో కంప్యూటర్ ఫ్యాకల్టీ గా పని చేస్తున్నటువంటి శ్సాయి లక్ష్మిని ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్ బాబు ప్రసంశించారు.అలాగే ఇండోనేషియాలో జరగబోయే అంతర్జాతీయ స్థాయి పోటీలలో కూడా పరవాడ జూనియర్ కాలేజీకి విజయ పతాకాన్ని ఎగరవేయాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ వారి విజయయాత్ర కొనసాగాలని ఆకాంక్షించారు.

# ఐదు సంవత్సరాల పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు సన్మానం

- **ముఖ్య అతిథిగా గుడివాడ అమర్నాథ్,బొడ్డేడ ప్రసాద్, శోభా హైమావతి**



**జయభేరి, పరవాడ:**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గంలోని మాజీ ఎమ్మెల్యే ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గం సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ అధ్యక్షతన మూడు మండలాలకు చెందిన గ్రామ సర్పంచులు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేసి ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా అభినందన సభ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గంలో,ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, ముఖ్య నాయకులు, మూడు మండలాల మాజీ సర్పంచ్లు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# మోడీ తలవంచితే దేశం తలవంచదు

- **దేశ ప్రయోజనాల కోసం మా పోరాటం కొనసాగుతుంది**
- **US ట్రేడ్ డీల్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలి – యువజన కాంగ్రెస్ డిమాండ్.. ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)**



**జయభేరి, ఉప్పల్ :**

దేశ ప్రయోజనాల కోసం గళమెత్తిన యువజన కాంగ్రెస్ నాయకుడు హైదరాబాద్‌లోని ఇంద్ర పార్క్ ధర్నా చౌక్ వద్ద US Trade Deal ఒప్పందాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌తో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆలిండియా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయభాను, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి గారు పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) పాల్గొని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని, వెంటనే దీనిని రద్దు చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# తగ్గని క్రేజ్.. ఆ స్టార్ హీరోలో ఛాన్స్..



తెలుగులో వరుసగా సినిమాలు చేసిన ఈ అమ్మడు. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది ఈ బ్యూటీ. నటనతోనే కాదు గ్లామర్ పరంగానూ మెప్పించింది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న నిధి అగర్వాల్ కు హిట్స్ మాత్రం అంతగా పడలేదు. ప్రస్తుతం ఈ అమ్మడు వరుస సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. మొన్నటివరకు టాలీవుడ్ సినిమాలో మెరిసిన ఈ భామ. ఇప్పుడు పాన్ ఇండియా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది. ఇటీవలే రెండు పాన్ ఇండియా సినిమాలు చేసింది ఈ అందాల భామ. ఇటీవలే ఈ ముద్దుగుమ్మ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన హరి హరవీరమల్లు సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా నిరాశపరిచింది. అలాగే ప్రభాస్ నటించిన రాజా సాబ్ సినిమాలో హీరోయిన్ గా చేసింది. కానీ ఈ సినిమా కూడా ప్రేక్షకులను నిరాశపరిచింది. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ బ్యూటీ మాస్ రాజా రవితేజ కొత్త సినిమాలో ఎంపికైనట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇరుముడి సినిమా తర్వాత గోపిచంద్ మలినేనితో ఓ సినిమా చేస్తున్నారు రవితేజ. ఆ సినిమా కోసం నిధి అగర్వాల్ పేరును పరిశీలిస్తున్నట్టు టాక్ వినిపిస్తుంది.



# దైవమే పగబట్టిందా.. పోచమ్మ

దేవుళ్లను అడ్డుపెట్టుకొని మనుషులు చేసే కుట్రలు, కుతంత్రాలు ఎన్నో! అందులో బలయ్యే అమాయక జీవితాలు ఎన్నెన్నో! ఇలాంటి నేపథ్యంలో సినిమాలు రావడం కొత్తేమీ కాదు. కానీ, మైథాలజీకి మర్డర్ మిస్టరీని జోడించడం మాత్రం కొత్త ప్రయోగమే! అలా.. మర్డర్ ఇన్వెస్టిగేషన్‌తో సాగే హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన తెలుగు వెబ్‌సిరీస్ 'పోచమ్మ'. మొత్తం ఐదు ఎపిసోడ్స్‌తో ఆహా వేదికగా విడుదలై.. రికార్డ్ వ్యూస్ కొల్లగొడుతున్నది. కథలోకి వెళ్తే.. అరకులోని ఓ గ్రామంలో పోచమ్మ విగ్రహంతో ఉన్న ఓ కాఫీ ఎస్టేట్ ఉంటుంది. ఆ ఊరి ప్రజలంతా ఆ విగ్రహాన్ని భక్తితో కొలుస్తుంటారు. ఆ ఎస్టేట్ ఓనర్ అయిన రఘుపతి (అచ్యుత్ కుమార్).. ఆర్థిక సమస్యల కారణంగా దానిని అమ్ముకొని, అందులోనే మేనేజర్‌గా పనిచేస్తుంటాడు. ఆ ఎస్టేట్‌ను ఫ్రెడ్రిక్ (రమేష్ ఇందిరా) కొనుగోలు చేస్తాడు. కుటుంబంతో కలిసి ఆ ఎస్టేట్‌లోని బంగళాలో దిగుతాడు. అయితే, రఘుపతి ఎంత చెప్పినా వినిపించుకోకుండా.. తన బంగళా ఎదురుగా ఉన్న పోచమ్మ విగ్రహాన్ని ఫ్రెడ్రిక్ బలవంతంగా తొలగిస్తాడు. ఆ సంఘటన జరిగిన తర్వాత ఫ్రెడ్రిక్ ఇంట్లో అనూహ్య సంఘటనలు చోటు చేసుకుంటాయి. అతని కుటుంబంలో తరచుగా గొడవలు జరుగుతుంటాయి. ఈ క్రమంలోనే ఫ్రెడ్రిక్ కూతురు జెస్సీ (స్నేహల్ కామత్) అనుమానాస్పద రీతిలో మృతి చెందుతుంది. అయితే, జెస్సీ చావుకు రఘుపతి కొడుకు సురేష్ కారణమని ఫ్రెడ్రిక్ పెద్ద కూతురు ఇవా (ప్రియా) ఆరోపిస్తుంది. విచారణ ప్రారంభించిన పోలీసులు.. ఇవా భర్త డేవిడ్ (అర్జున్ అంబటి)ని కూడా అనుమానిస్తారు. అసలు.. జెస్సీ ఎలా చనిపోయింది? అందుకు కారణం.. పోచమ్మ విగ్రహం తొలగించడమేనా? ఫ్రెడ్రిక్ ఇంటిపై పోచమ్మ పగబట్టిందా? మరే ఇతర కారణాలు ఉన్నాయా? సురేష్‌పై ఇవాకు ఎందుకు అనుమానం వస్తుంది? అసలు ఫ్రెడ్రిక్ జీవితంలోని రహస్యాలు ఏంటి? తన కుటుంబంలో జరుగుతున్న అనర్థాలకు అసలు కారకులు ఎవరు? ఇందులో రఘుపతి కుటుంబం హస్తం ఏమైనా ఉందా? అనేది తెలియాలంటే.. పోచమ్మ వెబ్ సిరీస్ చూడాల్సిందే!

# 'జైలర్2' ఓటీటీ డీల్ 160కోట్లు?



సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జూన్‌లో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'జైలర్' బాక్సాఫీస్ బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో ఈ సీక్వెల్‌పై మరింతగా అంచనాలు ఏర్పడ్డాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో సంస్థ 160కోట్లకు కొనుగోలు చేసిందని తెలిసింది. ఇది ఇప్పటివరకు తమిళ సినిమా ఓటీటీ హక్కుల విషయంలో రికార్డని, రజనీకాంత్ సినిమాల్లో కూడా అత్యధికమని చెన్నై సినీ వర్గాలంటున్నాయి. చిత్ర నిర్మాణ సంస్థ సన్‌పిక్చర్స్‌తో ఇటీవలే అమెజాన్ ప్రైమ్ ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకుందని సమాచారం. 'జైలర్' తొలిభాగం దాదాపు 600కోట్లు వసూలు చేసింది. ఈ నేపథ్యంలో సీక్వెల్ బాక్సాఫీస్ పర్‌ఫార్మెన్స్‌పై ట్రేడ్ వర్గాలు నమ్మకంగా ఉన్నాయి. ఈ క్రేజ్ కారణంగానే అమెజాన్ ప్రైమ్ భారీ మొత్తానికి డిజిటల్ హక్కుల్ని కొనుగోలు చేసిందని అంటున్నారు. ఎస్‌జే సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు తదితరులు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, విజయ్ సేతుపతి అతిథి పాత్రల్లో కనిపించనున్నారు.

# విజయ్ దేవరకొండ కొత్త సినిమా షురూ.. అంచనాలు పెంచేసిన ఫస్ట్ లుక్ పోస్టర్..




ఇండియన్ సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లేందుకు తనదైన ముందడుగు వేశారు హీరో విజయ్ దేవరకొండ. హాయ్ నాన్న ఫేమ్ డైరెక్టర్ శౌర్యువ్ తో విజయ్ దేవరకొండ చేస్తున్న హ్యూజ్ గ్లోబల్ ప్రాజెక్ట్ ఈ రోజు అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. ఇంటర్నేషల్ టెక్నీషియన్స్ ఈ మూవీకి వర్క్ చేస్తుండటం విశేషం. వైరా బ్యానర్ నిర్మిస్తున్న ఈ ప్రెస్టీజియస్ మూవీ అనౌన్స్ మెంట్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ సినిమా మీద హై ఎక్స్ పెక్టేషన్స్ క్రియేట్ చేస్తోంది.

విజయ్ దేవరకొండ, డైరెక్టర్ శౌర్యువ్ సినిమాకు హౌస్ ఆఫ్ ది డ్రాగన్, ఫాల్ ఔట్ వంటి హాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన అలెజాండ్రో మార్టినెజ్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గాడ్స్ ఆఫ్ ఈజిప్ట్, బ్యాట్ మ్యాన్ ఫరెవర్, స్నోపియర్సర్ చిత్రాల వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ ఎరిక్ డస్ట్ ఈ మూవీకి పనిచేస్తున్నారు.

యానిమల్, ఓం శాంతి ఓం వంటి చిత్రాలకు పనిచేసిన సురేష్ సెల్వరాజన్ ఈ సినిమా ప్రొడక్షన్ డిజైనర్ గా వ్యవహరిస్తున్నారు. పలు సూపర్ హిట్ చిత్రాల కంపోజర్ హేషమ్ అబ్దుల్ వాహాబ్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇండియన్ సినిమాకు గ్లోబల్ స్థాయి క్రేజ్ తీసుకురావడంలో వారణాసి, రాకా చిత్రాల్లా విజయ్ శౌర్యువ్ మూవీ కూడా ప్రయత్నిస్తోంది.

ఈ రోజు రిలీజ్ చేసిన వీడీ శౌర్యువ్ మూవీ పోస్టర్ లో విజయ్ దేవరకొండ చేతిలో నాలుగు పెట్ డాగ్స్ ను తీసుకుని నడుచుకుంటూ వస్తుండటం, వెనక ఏడుగురు వ్యక్తులు వివిధ రకాల ఆయుధాలు చేపట్టి రావడం ఆసక్తి కలిగిస్తోంది. 'ఇప్పుడు కనిపించే కోపమంతా ఒకప్పటి ప్రేమ' అంటూ పోస్టర్ పై రాసిన క్యాప్షన్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. మైథాలజికల్ యూనివర్స్ బ్యాక్ డ్రాప్ లో రూపొందనున్న ఈ సినిమా ఒక కొత్త ప్రపంచాన్ని ప్రేక్షకులకు చూపించనుంది.

# అబ్బో.. ఈ అమ్మడు మామూల్ది కాదు..!



బాలీవుడ్ హాట్ బ్యూటీలలో ఒకరైన ఊర్వశి రౌటేలా సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో మెరుస్తూ యువతలో మంచి క్రేజ్ అందుకుంది. ఉత్తరాఖండ్‌కు చెందిన ఈ నటి 15 సంవత్సరాల వయసులోనే తన మోడలింగ్ వృత్తిని ప్రప్రంభించింది. ఆమె మిస్ టీన్ ఇండియా 2009 టైటిల్‌ను గెలుచుకుంది. చైనాలో జరిగిన మిస్ టూరిజం క్వీన్ ఆఫ్ ది ఇయర్ 2011 టైటిల్ కూడా ఆమె సొంతం చేసుకుంది. ఈ పోటీలను గెలుచుకున్న మొదటి భారతీయ మహిళగా ఆమె నిలిచింది. 2013లో సింగ్ సాబ్ ది గ్రేట్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది. ఆ తర్వాత ఆమె హేట్ స్టోరీ 4, గ్రేట్ గ్రాండ్ మస్తి, సనం రే, పగల్ పంతీ వంటి చిత్రాలలో నటించింది. కానీ ఆమెకు పెద్దగా సినిమా అవకాశాలు దక్క లేదు. దీంతో చేతిలో అంతగా డబ్బు లేని పరిస్థితి ఏర్పడింది. సినిమా అవకాశాలు ఇస్తామని మోసం చేసిన వారే ఎక్కువ కావడంతో ఆమె సినీ కెరీర్ ముగిసిపోయిందని భావించారు. సరిగ్గా అదే సమయంలో ఊర్వశికి భారత క్రికెటర్ హార్దిక్ పాండ్యాతో పరిచయం ఏర్పడి, ఆయనతో డేటింగ్ చేస్తున్నట్టు వార్తలు వచ్చాయి. సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఊర్వశి రౌటేలా ఇప్పటివరకు ప్రధాన హీరోయిన్‌గా కేవలం 7 సినిమాలు మాత్రమే చేసింది. అవి కూడా అంతగా చెప్పుకోదగినవి కావు. అడపా దడపా ఐటమ్ సాంగ్స్‌లో కనిపించేది. కానీ సినిమా ఇండస్ట్రీకి వచ్చి 13. ఏళ్ల లోపులోనే ఆమె రూ. 150 కోట్లు పెట్టి ముంబైలో ఒక పెద్ద బంగ్లాను కొనుగోలు చేశారు. ఈ డబ్బంతా దుబాయ్, యూకే, కెనడా వంటి దేశాల్లో ఈ బ్యూటీ తన గ్లామర్‌తో సంపాదించిందని ప్రచారంలో ఉంది. ఇలా ఊర్వశి కేవలం 13 ఏళ్ల సినిమా కెరీర్‌లో సంపాదించలేనిది కేవలం రెండు సంవత్సరాలలోనే సుమారు రూ. 300 కోట్లు వెనకేసినట్టు వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఆస్తిపాస్తులు రూ. 700కోట్లు అని అంచనా వేస్తున్నారు. అంతే కాదు స్పెషల్ సాంగ్స్ కు నిమిషానికి రూ. కోటి రూపాయిలు తీసుకుంటుందని కొన్ని రిపోర్ట్స్ చెప్తున్నాయి. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ తన అందంతో మతిపోగొడుతోంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**